కలుపు మొక్కలను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు



కుత్బుల్లాపూర్: ఫుట్ పాత్‌పై పెరిగిన కలుపు మొక్కలను అల్వాల్ ట్రాఫిక్, హైడ్రా సిబ్బంది తొలగించారు. సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై కలుపు మొక్కలను తొలగించే విషయంపై సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ప్రమాదాలు చోటు చేసుకున్న విషయాన్ని గుర్తించిన అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు వెంటనే రంగంలోకి దిగి సిబ్బందితో వాటిని తొలగించారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపైకి వచ్చిన మొక్కలను తొలగించడం పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వంగవీటి మోహన రంగాకు ఘన నివాళి

నిజాంపేట్: వంగవీటి మోహన రంగా తన తుది శ్వాస వరకు పేదల పక్షాన పోరాడిన మహానాయకుడు అని ఎన్ఎంసీ మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ అన్నారు. శుక్రవారం ప్రగతినగర్‌లో వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంభీపూర్ కృష్ణ, పుప్పాల భాస్కర్, పృథ్వీ, బోనం నాయుడు, మల్లేశ్వర్‌రావు, సుధాకర్, లచ్చిబాబు, జైరాం, రంజిత్, శివ, నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారాహిదేవి నవరాత్రి వేడుకలు



నిజాంపేట్: వారాహి దేవి నవరాత్రి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేంకటశివ రామాయలంలో వారాహి నవరాత్రుల సందర్భంగా ఆగంరాజు ముదిరాజ్ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. వివిధ పూజలు నిర్వహించారు.

చెత్తను తరలించరూ!

- పాఠశాల ప్రహరీ పక్కనే పేరుకుపోతున్న వ్యర్థాలు
- దుర్వాసనతో కాలనీవాసులు, విద్యార్థులకు తిప్పలు
- పట్టించుకోని అధికారులు



స్కూల్ గోడను ఆనుకుని డంప్ చేసిన చెత్త

రంగారెడ్డినగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త డంపింగ్ పాయింట్ల తొలగింపు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఓ పక్క అధికారులు బహిరంగంగా చెత్త వేయరాదని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కొందరిలో మాత్రం మార్పు రావడం లేదు. జంట సర్కిళ్ల పరిధిలో ఇళ్ల నుంచి వెలువడే చెత్త వ్యర్థాలను చెత్తసేకరణ ఆటో రిక్షావాలాలు తరలిస్తున్నారు. దీనికి ప్రతి నెలా ఇంటి నుండి రూ.50 మొదలుకుని రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. అయితే చాలా మంది తమ ఇళ్ల వ్యర్థాలను సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తూ స్వచ్ఛ సర్వేక్షణ్‌కు తూట్లు పొడుస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి నందానగర్‌లోని ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రహరీకి ఆనుకుని కొన్ని రోజులుగా చెత్తను డంప్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చెత్త డంపింగ్ పాయింట్ లేకపోయినా జన సంచారం అంతగా ఉండకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వ్యర్థాలను వేస్తున్నారు. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, తాము రోగాల బారిన పడతామని స్థానికులు వాపోతున్నారు. చెత్త దుర్వాసనలతో పాఠశాల విద్యార్థులపై పెను ప్రభావం చూపే ఆస్కారముంది. సర్కిల్ అధికారులు చెత్త డంప్ చేయకుండా నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కుత్బుల్లాపూర్: నగరంలోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరైన సభకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. గాజులరామారం నుంచి శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో సుమారు 40 బస్సుల్లో వెళ్లారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాయకులు అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



కార్యకర్తలతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి



కార్యకర్తలతో కలిసి గాజులరామారం నుంచి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ఘనంగా అల్లూరి సీతారామ రాజు జయంతి

నిజాంపేట్: విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ప్రగతినగర్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి స్ఫూర్తితో భారతమాతకు సేవ చేస్తూ వారి ఆశయ బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.



సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయండి: కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: భూ భారతి, రేషన్‌కార్డులు, ఎల్ఆర్ఎస్‌లో పేరుకపోయిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చోట మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో భూ భారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ ఎస్ అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మండలాల, మున్సిపాలిటీల వారిగా భూ భారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎదురౌతున్న ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబంధించిన కోర్టు కేసులు, లిటిగేషన్‌లో ఉన్న ప్రభుత్వ భూముల ఫిజికల్ పొజిషన్ పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టరు సూచించారు. త్వరితగతిన రేషన్‌కార్డులు పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలన్నారు.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలి

సుభాష్‌నగర్: దూలపల్లి ప్రధాన రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న వారికి మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని పీఏసీఎస్ దూలపల్లి మాజీ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా సొంత స్థలాల్లో షాపులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అధికారులు ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పరిహారం ఇప్పించాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ తదితరులు

పోరాటాన్ని రగిలించిన నిప్పురవ్వ దొడ్డి కొమురయ్య

సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని, పోరాటాన్ని రగిలించిన నిప్పురవ్వ అని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని షాపూర్‌నగర్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. పసుల అంజయ్య, రావుల స్వాతి, ఈ దేవదానం, శ్రీను, నర్సింహులు, దుర్గ, సురేష్, లింగం పాల్గొన్నారు.

దేశ కీర్తిని చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద

రంగారెడ్డినగర్: భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ కమిటీ హాల్‌లో వివేకానంద వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన మార్గాన్ని ఎంచుకుని దేశ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రంగా సాయిగౌడ్, తిమ్మయ్య, నవీన్, విజయ్, సత్యనారాయణ, దత్తుగౌడ్, సందీప్, సాయి కిరణ్, రాంచందర్, రాందాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు కేవీఆర్ రోడ్డు, విజయశాంతి గల్లీ, సినీ ప్లానెట్ రోడ్డు, ఎన్‌సీఎల్ కాలనీ, 11 కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీనివాస కాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, జయభేరి బ్యాంక్ కాలనీ, 11 కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో సెంట్రల్ బ్యాంక్, దూలపల్లి చౌరస్తా నుంచి ఏఎంఆర్, రాజధాని దాబా, అపర్ణ వెంచర్స్, మికాసా రోడ్డు, 11 కేజీ నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:30 నుంచి 4 గంటల వరకు శ్రీనివాస కాలనీ, వేంకటేశ్వర కాలనీ, అశ్విని కాలనీ, రాయల్ పార్క్, నూజివీడు సీడ్స్ పరిశ్రమ వెనుక గల్లీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిజాంపేట్: మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు రత్నదీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లైన్, నమహా అపార్ట్‌మెంట్స్, బుద్ధ అపార్ట్‌మెంట్స్, లక్ష్మీ నగర్, మియాపూర్ ఎక్స్ రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ శ్రీలా గార్డెన్స్ ఫీడర్‌లో ఉదయం 11:30 నుంచి 12 గంటల వరకు దోవా కాలనీ, అభయాంజనేయ స్వామి ఆలయం, డైనమిక్ కాలనీ, 11కేవీ మయూరి నగర్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు ఆర్క్ టవర్స్, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు, మయూరినగర్, వృద్ధాశ్రమం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

సుభాష్‌నగర్: గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్య విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాలను ప్రకటించారు. 11కేవీ మగ్దూమ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మగ్దూమ్‌నగర్, ఎన్టీఆర్ నగర్, నాగార్జున స్కూల్ లేన్, శ్రీరామ్‌నగర్, బేకరీ గడ్డ, శ్రీరామ్‌నగర్ ఏ, బీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.